ఓం‌శ్రీసాయిరాం

**ప్రథమ సమావేశ వైచిత్రి**

తొట్టతొల్త వేంకటగిరికి బాబా సం॥ 1950లో వేంచేసి, దాదాపు పది రోజులుండిరి. వారి రాకకు ఒక నెల ముందుగా, మిత్రుల ప్రోద్బలము వలన షిర్డీసాయి పటమొకటి కొనివచ్చి యింట నుంచుకొంటిని. దానికి ప్రత్యేకముగా పూడజలేమియు చేయలేదు.

స్వామి రాకకు పూర్వమే, వారి మహిమ వినియుంటిని. ఆర్తుడనుగాన, స్వామి కృపతో బాధలు బాపికొను కోరికతో, ఊరిలో బాబా ఉన్నన్ని రోజులు వీలున్నంతవరకు భజనకు పోయి దర్శనము చేసుకొనుచుంటిని. రెండు మూడు రోజులు గడచినమీదట, నాకు ఐదు పద్యములు స్ఫురించినవి. అవి ఇందు ఉదహరించితి.

అఖిలలోకచక్షు, వారోగ్య సుఖదాత,
మాన్యహృదయ ధర్మమార్గనేత,
అస్మదిష్టదైవమగు సూర్యభగవాను
డంచు, సాయిదేవు నాత్మనెంతు॥

అడుగడుగున బెడదారిన్
బడి పోవుచు బాపకూప పతితుండగు నం
ధుడ, నాకు జ్ఞాననేత్రం
బిడుమా, హస్తావలంబమిమ్మా, సాయీ॥

ధనము గొప్పజూచి కొనియాడి సేవింప,
లోకమందుగలరనేక జనులు;
మనసు గొప్పజూచి మన్ననగావించి
ప్రోవ, సాయిదేవ నీవె దిక్కు॥

సాధువులై, పరహిత సుఖ
సాధకులై, ధర్మవృత్తిచరులై, దైవా
రాధాకులౌ సజ్జనముల
యాదివ్యాధులను మాన్పవా, సాయివిభూ॥

స్వపరహాని సల్పు నపమార్గచరులచే
క్షుభితమైన జగతి కభయమొసగి
ఉభయతారకముగ నొప్పు మహాత్మత
జూపవయ్య, సాయిసూర్యదేవ॥

ఈ పద్యములు ఒకే కాగితముపై వ్రాసి, నా పేరుగాని చేవ్రాలుగానీ చేయక, ఆర్తభక్తుడు అని మాత్రము చేవ్రాలుచేసి, నగరి అడ్రసుకే బాబాకు పంపుకొంటిని. వీనిని పంపిన రెండు దినములలో నొక విచిత్రము జరిగినది.

నిత్యము మా రెండవ సోదరియు, నా గృహిణియు, నా పెద్ద కుమార్తెను కొని, భజనకేగి, స్వామికి నమస్కరించుకొని వచ్చుచుండిరి. ఇవి పంపిన రెండు దినములావల, వీరు నమస్కరించుకొని బాబా పాదాలపై బిడ్డనువైచి, పిమ్మట జనములోనుండి ఈవలికి వచ్చి, మెట్లు సగము దిగివచ్చి, బాబా ఇటువైపు వచ్చినచో నింకను కొంతసేపు చూతమని అందు నిల్చియుండిరి. హాలులో నుండిన స్వామి, ఉన్నట్లుండి అందున్న దాదాపు వంద జనమును దాటుకొని గబగబ నడచుచు మెట్ల కడకు వచ్చి, వీరిని చూచి, 'అమ్మా! మీరు నాకోసమేనా ఉన్నారు?' అని అడిగారట. వీరు ఆనందాశ్చర్యములతో మెట్లెక్కి స్వామిచెంతకేగి, 'ఔను స్వామీ!' అన్నారు. 'ఎందుకమ్మా ఉన్నది?' అన్నారు బాబా. మా సోదరిని చూచి, ఆమె నా యిల్లాలి అనారోగ్యతను మనవిచేయనెంచి, ఈ అమ్మాయికి అని వాక్యము పూర్తిచేయకముందే, స్వామి బిడ్డనుద్దేశించి, 'అమ్మా! పాపకు బాగులేదా ఏమి?' అని అడిగినారు. ఈ బిడ్డకు అప్పటికి పదునొకండు నెలలు వయస్సు. రెండు నెలలుగా ఆమెకు ఎన్ని వైద్యములు చేసినను, కాలప్రవర్తి కాకుండెను. అదిగాక, ఆమెకు పుట్టుకనుండియే మెడయు, నడుమును చచ్చు. అవి నిలుచుటలేదు. మా సోదరి బిడ్డకేర్పడిన ప్రస్తుతపుటనారోగ్యమే మనవిచేసెనుగాని అంతకన్న భయంకరమగు ఆజన్మ లోపము చెప్పనేలేదు. చెప్పినది విని, స్వామి లోనికేగి, వీరికి విభూతిప్రసాదము తెచ్చియిచ్చి, 'రెండు వేళల ఈ మందు నీటిలోగలిపి పాపకు పోయుడు. బాగుండును' అని సెలవిచ్చి, తన అమృతహస్తముతో ఆ పాప శిరస్సునుండి వెన్నెముక కడవరకు తాకి నిమిరినారు. ఆవల వీరికి సెలవిచ్చి పంపిరి.

ఈ సంఘటన జరిగిన కొలది రోజులలోనే బిడ్డకు మలబద్ధకము వదలినది అట్లుండ, రెండు నెలలలోగా మెడయును,

నడుమును చక్కగా నిల్చినవి. ఇందుకై నేను ఆవగింజంతకూడ మందు ఇప్పించలేదు. ఇట్టి వ్యాధికై వేలు వ్యయించి వ్యర్థమైనవారిని చూచుచున్నాము. ఇందు గమనింపదగిన విశేషమింకొకటి ఉన్నది. నేను పలానివాడననిగానీ, వీరు నావారలనిగానీ, ఆనాటికి నగరిలో నెవరికినీ తెలియదు. కావున, మమ్ముగూర్చి బాబా కెవరైనా చెప్పినారని తలంప వీలేలేదు. వీరును తమసంగతి యిది అని చెప్పుకోలేదు. పేరులేని పద్యాలకాగితము తప్ప, కవరులో ఒక అక్షరమైన వేరు జాబుగా వ్రాసియుండలేదు నేను.

అంతఃపుర ప్రదేశములో, అంత జనములో, ఇంత అనామకులగు వీరికడకు అందరిని దాటుకొని తానుగా వచ్చి ఆదరించి ఆర్తి తీర్చినారు బాబా అంటే, ఇందులోనే విజ్ఞులు అర్థము చేసికొనవచ్చు స్వామి ఎవరైనది! సర్వాంతర్యామిగా నుండు పరమాత్మకు దప్ప అన్యులకీ యెఱుక ఎట్లు సాధ్యము?

నేను పంపికొన్న పద్యాలలో నొకదానికి జవాబిచ్చినారు స్వామి అని అర్థము చేసికొంటిని.

అటుతర్వాత, ఒక్కసారికూడ స్వామి పాదము తాకి నమస్కరించుకొను వీలు నాకు కలుగలేదు. వినాయకచవితినాడు బాబా పయనము. స్వామికి నమస్కరించుకొననిదే భుజింపనని ఇంటిలో చెప్పి, దీక్షబట్టి ఆదినము భజనకేగితిని. సాయంత్రము నాలుగు గంటలకు బాబా బయలుదేరుచు నొకగంటముందు పూజామందిరములోనికి వచ్చి, కొందరు భక్తులను పిల్చి మాట్లాడిరి. కొంసేపైన తరువాత, అందరికన్న వెనుక నిల్చియున్న నన్ను చల్లగాచూచి, రమ్మని హస్తసంజ్ఞ చేసిరి. విజనప్రదేశమునకు గొనిపోయి రెండు మూడు నిముషములు సంభాషించిరి.

'దైవము తప్ప నాకెవరు శరణ్యము లేరని' చెప్పి, నమస్కరించి కన్నీరు నించుకొనుచు నిలచియున్న నా వీపు ఒకచేతను, తన గుండె నొచేతితోను బాబా తట్టుచు, 'నాయనా! నేనున్నాను. భయపడకు!' అని ముమ్మారు సెలవిచ్చిరి. సముద్రమధ్యమున భగ్నమైన నౌకవంటి జీవితముగల దైవోపహతునికి, ఇట్టివారికి వేలకు లక్షలకు, 'నేనున్నాను, నీ భారములన్నియు నామీదవేసి నీవు హాయిగా నుండుము, భయపడకు, నేనన్నియు చూచుకొందును' అని చెప్పుటకుగానీ, ఆరీతిగా ఇందరికిని ఇంకెందరకేనియు చెప్పి కాపాడి క్రియలో ఋజువు చేయుటకును, ఒక్క భగవంతునికి తప్ప, మానవమాత్రుడెవరికైనా సాధ్యమా!

ఇట్లు భగవానుడు సాయిరాముడు, నాయట్టి ఆర్తులను, పామరులను తన అభయప్రదానసుధాస్వాదనానిమగ్నుల గావించి, తేనెలోబడిన ఈగలచందము సేయుచున్నారు. పరమాత్ముని ధ్యానము, భజనము, గుణకథార్ణవము, సంకీర్తనము, మున్నగు వానితో జీవిత మీస్థితి చెందుటకన్న వాంఛనీయముగానీ అతిశయముగానీ అన్యమేమున్నది!

......................................................................................................................

విన్నపము

నిత్యమంగళమైన నిర్గుణ బ్రహ్మంబు
సృష్టి సంసారమున్ చేయగోరి
విశ్వంబను గృహంబు వెలయించి, దానిలో
తా నింటిపెద్దగ తనరుచుండు,
ఆయింట తాఋమార్గనివార్యముగ రాగ
తనయిల్లు సవరించుకొనదలంచి
అవసరమ్ముకొలంది ఆ దేశకాలాల
కనువగు విధమున నవతరించి
నిఖిలతంత్ర స్వతంత్రుడు నియమరహితు
డైన పరమాత్మ నామరూపాదికముల,
నవ్యతరుడగు ననుట కీనాడు మనకు
ధరణి శ్రీసత్యసాయి ప్రత్యక్ష సాక్షి॥
క్షమయను సీతయు శౌర్యమన్ లక్ష్మణుం
డీ సాయిరామునం దిమిడియుందు;
నిగ్రహ శివుడు అనుగ్రహ శక్తియు
ఈసాయిహరునియం దిమిడియుందు;
ఐశ్వర్య రుక్మిణి ఆనంద గోవింద
డీసాయి కృష్ణునందిమిడియుందు;
ఒకటి రెండై, అసంఖ్యమై, ప్రకటమగుచు,

సకల మా రెండునై, రెండు నొకటియగు
అగుణ మందరి కవగత మగుటకొరకు
సగుణమై సత్యసాయిగ జగతి నిల్చె॥
నిర్బంధముల సల్పి నిజబంధువుల నిల్పి
తన మర్మము దెల్పు దైవమెవడు;
ఘనకార్యములు తానె యొనరించి, తత్కీర్తి
తన భక్తులకొసంగు దైవమెవడు;
భవబాధలనుబాపి పరసాధనలు జూపి
తన యాశ్రితుల నేలు దైవమెవడు;
ఊరూరి కింటింటి కొకనెపమ్మున నేగి
తనయందరన్ తన్పు దైవమెవడు;
కనిన వినినకొలది కడుదిగ్భ్రమము గొల్పు
కనని వినని దైవకళ యెవండు
అనుభవమునగాని అర్థముగారాని
అనఘు సత్యసాయి నభినుతింతు॥
నీవారి నేడ్పించి ఆ వెంట నవ్వించు
టానాటి యీనాటి యాటగాదె!
మనుజునట్లు నటించి మము మోసగించుట
ఆనాటి యీనాటి యాటగాదె!
శక్తిలేదనిపించి యుక్తిచే సాధించు
టానాటి యీనాటి యాటగాదె!
చెప్పి చేయకయుంట చెప్పక చేయుట
ఆనాటి యీనాటి యాటగాదె!
నేటి నీయాటలే నిన్ను బైటవేయ
ఏటికింకను దోబూచి యాటలోయి
చిన్నికృష్ణయ్యవేగదా చిట్టిసాయి
నిన్ను కనిపట్ట తెల్వికన్విప్పుమోయి॥
సృష్టిస్థితిలయంబు లిట్లంచు, భజనలో
పలుగతిన్ తాళంబువైచి చూపు;
తనయానలోన భూతంబు లైదిటి నిల్పి,
పరమాత్మ తానంట ప్రకటపరచు;
ఇహపరంబులు రెంట నెల్లలోతులనంటి,
అన్నింట తానుంటినంట తెల్పు
అలపు అదను మాని అందర నలరించి,
ఎల్లరాత్మీయులం చెరుకపరచు;
ఇట్టి దేవుండు మన తండ్రి చిట్టిసాయి,
భాగ్యవశమున దొరకెను భక్తులార,
తవిలి యర్చించి కృతకృత్యులవుదమయ్య
చవులెరుంగనివారితో చర్చలేల॥
ఎల్లనామమ్ముల కేకరూపతగొన్న
చల్లనిదైవము సత్యసాయి;
తల్లియు తండ్రియు తనువుగా వెలసిన
చల్లనిదైవము సత్యసాయి;

చెల్లనికాసుల చేకొని చెల్లించు
 చల్లనిదైవము సత్యసాయి;
ఎల్లజీవులు తనకన్నపిల్లలయ్యు,
పిల్లవాడుగ మనకెల్ల వెలసెనేదు;
పల్లవిత సత్యలీలుడు బాలసాయి
చల్లగా నెల్లలోకాల సాకుగాక॥

........................................................................................................................................

మనలో మన మాట

'ఎవ్వాని లీలల కిద్దియే యుద్దేశ్యమని హద్దు గుర్తింప నలవికాదు'

సామాన్యముగా మన మాటల తీరును, పనుల రీతియు పరీక్షించికొని, తదుపరి, స్వామి సంభాషణయు, చర్యలును సావధానముగా స్వానుభవములో పరిశీలించినచో, వాని విలక్షణత విశదమగును. మనమొక పనిచేసిన, సాధారణముగా నొక ప్రయేజనము నుపలక్షించియే యుండును. అంతకుమించి, ఒకటో అఱయో ప్రయోజనమునదే పనివలన సాధించితిమేని, మనము గొప్ప మేధావులమనితలంతుము. అట్లు సాధించినను, అందులో నేదో ఒకటే ప్రధానముగా నుండును. మిగతవి గౌణముగానుండును. స్వామి చర్యలు అట్టివిగా నుండవు. చేసిన దొకేపనియైనను, వేసినదొకే యడుగైనను, తత్ప్రయోజనములు మనకర్థమైనవే ఎన్నో యుండును. నిలుకడమీద తెలియునవి ఇంకెన్నోయుండును.

అట్లే, మనమొక మాట చెప్పిన, ఎవని నుద్దేశించి ఏ యభిప్రాయముతో పల్కుదుమో వానికి మాత్రమే ఆ అభిప్రాయమే అర్థమగును. ఇక వాని వెంటనుండువారి కది సంబంధింపదు. కానీ, మన బాబా మాటల తీరు ఇదికాదు. సహజముగా , సరళముగా స్వామి పల్కిన ఒక్క మాటయే, అందరియందును ఆయా వ్యక్తిగత మనోభావములను ప్రవర్తనలను సూటిగా స్పృశించును. ఇదిగాక, ఎదుటివారికి హితము ప్రియముగా చెప్పజాలము. అనగా, వాని మనస్సు నొవ్వకుండ, ఆనందపడునట్లుగా హితము చెప్పజాలము. కానీ, మన పొరపాట్లను స్వామి ఎంత మృదువుగా, ఆనందము నిచ్చుచు. నవ్వులాట మాటలతోనే మనకు తెల్పి దిద్దుచున్నారో, అనుభవించు భక్తులందరకు సువిదితమే.

అట్టి స్వామి చర్యలకు మాటలకు ఉదాహరణము. స్వానుభవమొకటి విన్నవింతును. ఒక యేడు స్వామి వెంకటగిరి దయచేసి యుండినప్పుడు, భజనలో సన్నిధిలో ప్రప్రథమముగా, 'చెంతజేర్పదేలనమ్మ శివతాయీ' అను పాట పాడితిని. అందులో 'ఆకలైన యప్పుడే లోకమాతా నీవు నాకు జ్ఞప్తి వత్తువమ్మ లోకమాతా! రాకపోతివేని నీవు లోకమాతా నేను కేకలేసి గోలసేతు లోకమాతా' అను చరణము పాడితిని. చిఱునవ్వుతో పాటనాపించి, 'నీవు కేకలేసి గోలచేసినచో! నేను రెండేట్లు వేసెదను' అన్నారు స్వామి.

పిమ్మట స్వామి పర్తికి చేరి, ఆ వేసవిలో నన్ను కరుణించి పర్తికి రప్పించుకొనిరి. ఆ రెండు నెలలు ప్రతి దినము భజనలో నాచే ఆ పాట పాడించి, ఆ చరణము పాడగానే ఈ మాటలు తాము పలికి పక పక నవ్వి అందరను ఆనందముగా నవ్వించుచుండిరి. తర్వాతయు తటస్థపడినప్పుడెల్ల ఆ ప్రశక్తి నడిపించుచునే యుండిరి. ఇదంతయు తమాషాకనియు, మనల నవ్వించుటకనియు అందరము తలంచుచుంటిమి.

రెండు సంవత్సరముల కావల, పర్తిలో నొక శుక్రవారము నాటి భజనలో నేను, అన్నియు పరమేశ్వరీపరములైన కీర్తనలే నామములే స్తోత్రములే పాడితిని. ఆ మధ్యాహ్నము భోజనానంతరము, పైనుండి స్వామి నన్ను పిలచి, పాటల పుస్తకము తీసుకొని పైకి రమ్మనిరి. అట్లే పరుగున పోయితిని. పై గదిలో తన యెదటికి వచ్చుటే తడవుగా, 'చెంపకుబట్టి తీసి రెండు అంటింతునా' అనుచు దెబ్బవేయు వాటముగా కుడిచేతిని ప్రసారించిరి స్వామి. నాకు దిగ్భ్రమమైనది. అట్లే నిలుబడితిని. ఏమి తప్పు టేసితినా, ఎందుకు స్వామికింత కోపము వచ్చెనా అని ఆలోచనలో మునిగితిని. అర్థముకాలేదు. ఇంతలో స్వామియే, 'ఏమి అమ్మ! ఒకటే అమ్మ! కూర్చున్నది మొదలు లేచుదాక ఒకటే అమ్మ! అమ్మ! అమ్మ! తీసి రెండు అంటింతును' అన్నారు. అన్నారేగాని, చేయి చాచినారేగాని, చెంపవ్రేటు వేయరైరి బాబా. ఈ సంభాషణ జరుగునపుడు ఎందుకో ఎందుకో నా దృష్టి స్వామి చాచిన చేతివైపు పడినది. ఏమి ఆశ్చర్యము! బాబా హస్తము మనము కనుదానికన్న ఇబ్బడిగా విస్తరించియుండెను. అనగా, చేతి వ్రేళ్ల కైవారముతో కూడ కలసిన ఎంత స్థలముండునో, అంత విశాలముగా నుండెను. అరిచేయి మాత్రమే! అందుపైన మరల మామూలుగా చేతివ్రేళ్లుండెను. ఆ దివ్యమంగళ పాణిపద్మము నిజముగా పద్మమువలెనే యుండెను. పసిపాపల అరచేతులలో నెత్తురెట్టు చర్మము మీదికి స్ఫురించుచుండునో, అంత అరుణముగా, కోమలముగా, అందముగా నుండెను ఆ హస్తము. ఆ సమయమున, ఆ అద్భుత దృశ్యమున చూపు నిలచిన నేను, స్వామి సెలవిచ్చిన మాటలనైన సరిగా విననైతి. స్వామికి కోపము వచ్చెనేమో అనుట అసలే మరచితిని. పులకితుడనై మ్రాన్పడియున్న నన్ను స్వామి హెచ్చరింపగా, చూపిటువైపు త్రిప్పి, ఒక నిముసమావల మరల చేతిని చూడగా ఆ వింత మాయమై, మామూలు హస్తమే అగపడినది.

ఈ ప్రకరణమిట్లాయె. అంతలో ప్రస్తావన మార్చిరి. ఇంతలోనట కొకరిద్దరు భక్తులు వచ్చిరి. వారిని చూపుచూ, 'వీరు పాటల పుస్తకమడుగగా ఈయనంటివటనే నీవు' అన్నారు స్వామి. 'ఎవరడిగిననూ ఇచ్చుచున్నాను. వీరడుగలేదు' అంటిని నేను. అంతట స్వామి, ' ఊహు, కాదు. వీరడుగగా నీవు తిట్టినావటనే' అన్నారు. ఇంక నాకేమియు తోచక 'రామ రామ' అన్నాను. అంతటితో పోనీయక, 'ఈయకుండుట అట్లుంచి, ఊళ్లుదీసి కొట్టినావటనే నీవు వీరిని' అన్నారు స్వామి. ఇపుడు అసలే తోచలేదు నాకు. 'బాబా ఎదుటనే ఉన్నారుగదా, ఇది ఏదైనా జరిగినదేమో, వీరినే చెప్పమనుడు' అంటిని.

అప్పటికా నాటికలో ఆ రంగము నంతటితో ముగించి, కొత్త దరువు నెత్తికొన్నారు బాబా. అది ఏమనగా, 'నేను కొన్ని వచనములు వ్రాసితిని. అవి నీవు చూచి తప్పులు సరిదిద్దియిత్తువా' అన్నారు స్వామి నాతో. 'అయ్యో, నాకేమి తెలియును, నా చేతకాదు' అంటిని నేను. అపుడు బాబా, ' అట్లుకాదు, నీవు వ్యాకరణము బాగుగా చదివికొన్న పండితుడవుకదా! నాకు వ్యాకరణము రాదు. అందుకు చెప్పుచున్నాను' అన్నారు. అంతట నేను, ' స్వామీ! నాది పొట్టకూటి పాండిత్యము. వ్యాకరణ ప్రకారమన్న మాత్రాన మావి ఒప్పులు కావు. లేని మాత్రాన స్వామి వాక్కులు తప్పులు కావు. తప్పులు చెప్పెడి వారము మేమే అగుదుముగాని, స్వామి ఎప్పటికినికారు' అంటిని. ఇంతటితో ఈ రంగము ముగించిరి.

ఈ నాటకమున కర్థమేమి? ప్రొద్దుపోవక, కొంచెము స్వామి నవ్వులాటలాడిరా! దీని పరమార్థమేమి? అని ఆలోచించుకొంటిని. కొన్నాళ్లకు ఇంతవరకర్థమైనది.

ఈ ఏకాంకిక నాటికలో, మొదటిది యేటుల రంగము. శివతాయి పాట పాడించి, కేకలేసి గోలచేసిన, రెండేట్లు వేసెదనని, రెండున్నరయేండ్ల ముందునుండియే చెప్పుచుండిరి. ఊపిరాడని పనులలో నుండు తల్లికడకు పిల్లవాడు వచ్చి, చిరుదిండి మున్నగు తన మనోరథము దీర్చుమని, అదేపనిగా వెంబడి విడువక అమ్మా అమ్మా అమ్మా అని వేధించినట్లే యున్నదిగదా, ఆనాటి భజనలో నా పాటల తీరు. విసుగు పుట్టినను ఓర్పుగల తల్లి, బిడ్డను తన్నకున్నను, తన్నబోయినంత కోపము నటించి భయపించి మాన్పించును. ఇట్లు నేను గోలసేయుట, తానేట్లువేయుట నటించుట ఈనాడు జరుగునని తెలిసియే రెండేండ్లనుండి చెప్పుచుండిరి పదే పదే. ఇంతకన్న నిందొక మహత్తర పరమార్థమున్నది. ఈ పాటయు ఆ ఆటయు సాకుగా, నా తల్లి మన తల్లి శివతాయి, తన ఆ దివ్య మంగళ హస్త దర్శనము నొసగి ఆనందింపజేయ సంకల్పించి ఇంత జరిపెను. ఆ చేతితో దెబ్బపడదాయెనని చింతపడుచున్నాను.

రెండవది పాటల రంగము. ఈ నాటికలో, అడిగినదే తడవుగా ఎవరికేని పొత్తమునిచ్చు నన్నుగూర్చికాదు ఈ కాండ నడిపినది అని అర్థమైనది. అపుడచట నెదుట నుండినవారో, ఆ మాటున నుండినవారో ఈ యేట్లకు గురియైనవారని నిశ్చయించుకొంటిని. ఇందలి తిట్లు, కొట్లును సమయోచితముగా రసోత్పాదనకై కావించిన కల్పనలేగాని, అడిగినవారికి పాటల పుస్తకము నీయకుండుట అను సత్యము లక్షితమగు ముఖ్యాంశము. ఇంతకును దీని తాత్పర్యముమేమి అనగా, బాబా పాటలు కావలెనని అడిగిన వారికి, అవి తెలిసినవారు తోడ్పడి ఈయకుండుట స్వామికి ప్రీతికరమగు రీతికాదని తేల్చినది.

ఇక కడపటిది, మాటల రంగము. ఇది సూటిగా నాకే పడిన యేటు; ఆనాటికి, స్వామి కొన్ని సూక్తులు నోటు పుస్తకములో వ్రాసి, అపుడపుడు చదివి భక్తులకు వివరించుచుండిరి. అవి స్వామి చదివిస్వామి వివరించి చెప్పనిదే, సరిగా అర్థమగు రీతిలో లేదు భాష. స్వామి సెలవిచ్చినచో, చదువుకొనగానే సులువుగా అన్వయించు రీతిలో ఈ వాక్కుల కుదిర్చి వ్రాసిన బాగుండునే. ఇందుకు స్వామి ఆనతిచ్చిన బాగుండునుగదా! అని ఆ యహంకారమునకు ఈ మొట్టు అని తెలిసికొంటిని.

ఆనాటి యీ మూడు రంగాల నాటికయు, నాకింతమాత్రమే అర్థమైనది. ఇంతే అన వీలులేదు. ఇంకెంత, ఎన్ని ప్రయోజనములు హేతువులు కలవో! స్వామి వేయు ప్రతి అడుగు, చేయు ప్రతి ప్రసక్తియు స్థూలదృష్టికి గోచరించు ప్రయోజనమాత్ర పర్యవసానముకలదై యుండునని తలంపక, భక్తులమగు మనము, అవి అనేకులకు అనేక రీతుల శ్రేయోదాయకములై యుండుననుట వారివారి అనుభూతులచే నిర్ణయించుకొని, పర్యాలోచన చేయవలెను. తన లీల, తన దయ యున్న వరకు మన కర్థమగును.

…………………………………………………………………………………………………………

శరణాగతి

శ్లో. హృదాకాశే సదా భాంతం శాథ మానంద రూపిణం।
జ్ఞాన భాను మహం వందే సద్గురుం సత్యసాయినం॥

సీ॥ కాపాడి ఊపాడి కాంక్షితవర్షమున్
గురిసి రక్షించు నర్కుండు సాయి;
మన దైన్య తిమిరంబు నణగించి, సంతోష
ఘన కాంచినిడు దివాకరుడు సాయి;
జగమెల్ల నిదురింప జాగరూకుండౌచు

సకలమున్గను కర్మసాక్షి సాయి;
అఖిల దీప్తి నిధానమై, లోకచక్షువై
సర్వులలో వెల్గు సవిత, సాయి;
భానుమండల దీప్తుండ నేనెయంచు
శంకయే లేక వాకొను సత్యసాయి,
మహిని బహిరంతరస్థుడై సహకరించి
ఇహపరమ్ములు భక్తాళికిచ్చుగాత.

సీ॥ ద్వేషించువారల దీవించి, ప్రేమతో
వరమిచ్చి, తము దాపు వెలపజేయు;
వికటంబుగ జగంబు వెకిలించు ధర్మమున్,
క్రటంబుగా నాదరంబుసేయు;
తత్కాత్మతృప్తికై తగుమాటలాడక
దండించియున్ బ్రమోదంబెగూర్చు;
మహికి సమష్టిగా మంగళకరుడౌచు,
వ్యష్టిగాగూడ సంతుష్టిసేయు;
జిత్రతమ సచ్చరిత్రుడు చిట్టిసాయి,
అతడు మన పిచ్చి తెల్వుల కందడోయి;
భక్తి పాత్రంబుమేరకు బ్రాప్తమైన
సత్యసాయి నెఱుంగుడీ, శాంతమతులు.

సీ॥ జపసాధనన్ నీదు కృపగాంతునందునా,
మనసు న్లిదు క్షణమాత్రమైన;
యోగంబుచే నిన్ను లోగొందునందునా,
యోపికలేదు కూర్చుండుటకును;
సంగీతమున నిన్ను సంగ్రహింతునటన్న,
సరిగమలైన నేనెఱుగనైతి;
గొప్ప కాన్కలొసంగి మెప్పింతునందునా,
నాకున్న భాగ్యంబు నీకెయెఱుక;
ఇట్టి రిక్తుండ నీ కృపనెట్లుగాంతు?
నీ వొసంగని సొత్తు నీ కెందుదెత్తు?
ఇచ్చితీ వాక్కు, భక్తియు, నింతమాత్ర;
మివియె నీకిత్తు, గొని, దయనిమ్ము సాయి.

సీ॥ సలుపని తప్పులు శతకోటిమోపినన్,
సరకుసేయని మనస్థైర్యమిమ్ము;
చేసిన తప్పొరుల్ చెప్పనేపనిలేక,
తెలిసి లజ్జించెడి తెల్వినిమ్ము;
భవచింతల్ మున్గి, భగవంతుదగినంత,
చింతింపనైతినన్ చింతనిమ్ము;
విన్న సద్విషయముల్ వీలున్నయంతలో
సాధింపవలెనన్న శ్రద్ధనిమ్ము;
తెలిసి యదుగంగ బిడ్డల కలవిగాదు,
వలసిన దొసంగ సమయంబు తెలియు నీకె;
కాన, నంతయుదల్లి నీపైనవైచి
హాయిగనుతెల్వి, శివతాయి, యీయవమ్మ!

అహమును గతమార్తు ననుకొందురేగాని,
యది నాకు దెలియకె హాజరగును!
అహముతో మమకార మనపాయినిగనుండు,
హానివృద్ధుల నది కాన నగును!
మమతలో గోపతాపములు మాటుగనుండు,
జీమ కుట్టిన నవి సిద్ధమగును!
దేహి కిన్నిటిమూట దేహాత్మభావంబు
సమ్మోహనాస్త్రమై క్రమ్మియుండు!
నిన్నయున్ నిన్నుమఱపించి, నన్నుజెఱుప
బూనికొన్నవి, వీనితోబోరనేర;
నన్ను రక్షింతువని నిన్నె నమ్మియుంటి
నేమిచేసిన సరియె, నీయిష్టమింక.

సంశ్రితావనపారీణ శరణు శరణు!
సంసృతిసముద్రతారణ శరణు శరణు!
జ్ఞానలోచనకారణ శరణు శరణు!
సత్యసాయి నభోమణి శరణు శరణు!

దసరా కవిసమ్మేళనము.
16-10-1958.

---

పురాణపురుషు నవీనపురాణము

ఆ।వె। నేటిరూపు విడక, నాటి వాసన, వన్నె,
చవులు, జూపు చవని నవతరించి
నట్టిదైన, మంటుగట్టిన క్రొంజెట్టు,
సత్యసాయి కల్పశాఖి నెంతు॥

అమిత వాత్సల్యమే యాదిమూలముగాగ,
బరమ కారుణ్యమ్ పాదు గాగ
శాశ్వత సత్యమే స్కంధమై తనరార,
సద్ధర్మమే బహు శాఖలుగను,
నవనవలీలలే చివురుజొంపములుగా
లాలనల్ పల్వన్నె పూలుగాను,
ఐహికసాహాయ్య మందలి పిందెగా,
నధ్యాత్మరుచి కాయ యగుచు బరగ,
బరమప్రపత్తియే పరిపక్వఫలముగా,
నానందమే రసంబొచు వెలయు,
సంశ్రిత సంతాప శాంతియే ఛాయగా,
మహిత కీర్తియే పరిమళముగాగ,
లోకసేవయే జీవితైక లక్ష్యముగాగ
సామరస్యమె తనసాజముగను,
అన్యతుష్టియే యాత్మపుష్టిగ నొప్పు
చస్వార్థమే శీలమై తనరుచు,
విరులు గాయలు బండ్లు, నేవేవినొసగు,
నడుగకున్నను బ్రాప్తమై నరిగియిచ్చు,
సకలదుడు సర్వసులభుడు సత్యసాయి

జగతి జంగమ కల్పవృక్షంబుగాదె॥

సీ॥ ధర్మ సంరక్షణకై తగురీతి బలుమారు లవనిపై భగవంతుడవతరించి,
దుష్టశిక్షణమునన్ శిష్టరక్షణ సల్పి సృష్టి సంఱక్షణ సేసె, నపుడు
ఒక్కొక్క పుట్టుక కొక్క ముఖ్యోద్దేశ్య, మొక్క వైశిష్ట్యంబు నొప్పుచుండె;
అలనాటి యవతారముల దివ్యమంగళ గుణగణంబులు నేడుగూడదనర,
కలసర్వదైవకళలతో నలరారి, కలిని మానవధర్మకలననుని,
అప్పరమేశ్వరుడిప్పు డిప్పుడమిపై సత్యసాయీశ్వర సంజ్ఞ దనర,
బుట్టపర్తిన్ దాను బుట్టెనేమోయని జిజ్ఞాసువులకు దోచెడివిధాన
చిత్ర విచిత్ర పవిత్ర చరిత్రుడై తన నాటినేటి తత్త్వములు చేర్చి,
ఆనందముగ బాబ యాడు నాటలు కొన్ని, తన జన్మదిన మహోత్సవమునందు,
అనుకొని యానంద మందగోరితినయ్య, వినగోరు వారెల్ల వినగవచ్చు;
సాయిరాముని సమాచరణ సరణిగల్గు, సత్యము ధర్మము శాంతి ప్రేమ,
శరణాగతత్రాణ శపథ నిర్వహణంబు, నరయ శ్రీరామునియవియ గావె;
మన సాయికృష్ణుని మానవనటనమున్, 'సకలమున్ నేనె'యన్ ప్రకటనంబు
మనసందలేని యమానుష లీలలు, నిర్లిప్తవృత్తియు నిర్వ్యకృతియు,
చిలిపియాటలు, సదా చిఱునగు మొగమును, పరామార్థరహితమౌ పనియె లేమి,
సచ్చిదానందుడై సర్వసాక్షిగనుంట, గోపాలకృష్ణుని గుణము గాదె;
ఆ త్రివిక్రమ పదన్యాసంబుజూపుడు, బుడుతడౌ వడుగయ్యు, బుడమినెల్ల
నక్రమంబుననణంచి యాక్రమించుచు మించు మన బాలసాయి వామనుడు కాడొ!
ఎంచినంతమాత్ర నేవేయున్ సృజియించు, పర్తీపురీశుడాబ్రహ్మ దాడె;
మంచిచెడ్డ లెఱింగి మనల బాలించెడి సాయినాథుండు కేశవుడు కాడొ!
ఆ జటాజాట మా యత్యంత సౌలభ్య మాకోప మాశాంతి యావిరక్తి,
ఆ భక్తవాత్సల్య మా విభూతియు నొప్పు, చిన్ని సాయీశు డాసివుడు కాడె;
ఈయోర్పు నీనేర్పు నీ గుణమ్ముల తీర్పు యీ పుత్రవాత్సల్య మీ నయంబు
ఈయఖండైశ్వర్య మీసామరస్యంబు నీవాక్కు నీ ఠీవి యీ వితరణ,
ఈ క్రియాదికశక్తు లెసగు నీ శివతాయి, సకలరూపిణి జగజ్జననిగాదె;
సంశ్రితులకు, గొప్ప చదువరికిన్ లేని యనుభవ జ్ఞానంబు నలవరించి,
అత్యలభ్యంబునై ఆత్మైకవేద్యమౌ, ఆనందమున్ స్థాయి నాత్మకొసగి,
నిశ్శబ్దముగ భక్తినిశ్రేణి నెక్కించు చాశ్రితశ్రేయమే యభిలషించు,
సత్యసాయీశుండు సద్గురువరుడౌట, నరయ దత్తాత్రేయ సరణిగాదె!
ఒక్కనికే వానిమక్కువ మేరకు, దల్లియు దండ్రియు దనయుడుగను,
బ్రభుడును విభుడును బ్రాణసఖుండుగ, నార్తినాపద్బంధు వగుచుదనరి
గురుడువై భక్తుని పరదైవతంబునై, తన్మనం బాత్మ దన్మయముసేసి,
తనవాడు భక్తు డాతనివాడు తానౌచు, ననితర సంబంధ మలవరించి,
నవవిధ భక్తిన్ నాసాయి నాయనే యేకైకలక్ష్యమై లోకమందు,
నాడెన్నడున్ లేని నవ్యత నీనాడు పూనినా డీననుబోంట్లకొఱకు;
ఎవరికివారె తన్నెచ్చుగా మన్నించె ననుకొన నందరన్ దనుపు సాయి;
శిక్షణసేయక రక్షణచేతనే ధరను ధర్మము నిల్పదరలు సాయి,
ఏ పేర నేరీతి నెవ రెప్పు డెందునేన్ దన నెంచు టది మంచిదనెడి సాయి,
'దైవమే' ననకుండ దల్లక్షణంబుల సులువుగా దనయందుజూపు సాయి,
మనుజు లెంతటివారికిని నంతుపట్టని మనసులు కని కొని మార్చు సాయి,
మచ్చలేని మచ్చు మానవధర్మాన, వింతవింత దైవ విలసనంబు,
నగుచు వెలుగు భగవదవతారమూర్తికి సత్యసాయి కిదియె ప్రణతి శతము॥
అక్రమత డిందు, ధర్మంబు విక్రమించు నఖిల జగమును సుజనాలి సుఖమునొందు
బాదుకొను భక్తి ధరణిపై నీదుకరుణ నంచు, నాశింతు, నాశీర్వజించు సాయి॥